నూతన కార్యవర్గం ఎన్నిక



అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గం

అబిడ్స్: ఉస్మాన్‌గంజ్‌లోని శ్రీ భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ వెల్లడించారు. గురువారం బాస్ సంస్థ కార్యాలయంలో అధ్యక్షుడిగా మేడిశెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. బద్రేశ్వర్, కోశాధికారిగా అనిల్‌కుమార్ ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాస్, వై.అశోక్, నరేందర్, ఉప కోశాధికారిగా శ్రీహరి, సంయుక్త కార్యదర్శిగా విజయానంద్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా అంజన్‌రాజ్‌ను నియమించినట్లు వెల్లడించారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయాలి

చార్మినార్: విద్యుత్ ప్రమాదాలకు గురైన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమా మహేందర్ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఈ విద్యుత్ ప్రమాదాలు సంభవించాయన్నారు. బండ్లగూడ చౌరస్తాతో పాటు అంబర్‌పేట్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదం మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆయన కోరారు.

వీజీ పురుషోత్తమ్ సేవలు అమోఘం



వీజీ పురుషోత్తమ్ సంతాప సభలో మిద్దె కృష్ణ, మ్యాతరి ధర్మేందర్ తదితరులు

అబిడ్స్: సీనియర్ కాంగ్రెస్ నాయకులు వీజీ పురుషోత్తమ్ సమాజానికి చేసిన సేవలు అమోఘమని అరుంధతి సేవా మండలి అధ్యక్షుడు మిద్దె కృష్ణ, ప్రధాన కార్యదర్శి మ్యాతరి ధర్మేందర్ పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన వీజీ పురుషోత్తమ్ సంతాప సభను అరుంధతి సేవా మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 30 ఏళ్లకు పైగా స్థానిక పేద ప్రజలకు, సమాజ శ్రేయస్సుకు వీజీ పురుషోత్తమ్ చేసిన సేవలు వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అరుంధతి సేవామండలి సభ్యులు బొబ్బిలి వెంకటేష్, చంద్రమోహన్, వెంకటగళ్ల శ్రీనివాస్, మహేస్, నాగేశ్వర్‌రావు, పి.వెంకటేష్, కుమార్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా వినాయక మండపానికి కర్ర పూజ



కర్ర పూజతో శంకుస్థాపన చేస్తున్న కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం గౌలిపురా వినాయక మండపాన్ని కర్ర పూజతో శంకుస్థాపన చేశారు. 45 ఏళ్లుగా గౌలిపురాలో మాజీ కేంద్రమంత్రి ఆలే నరేంద్ర, బస్తీ పెద్దలు వినాయక మండపాన్ని స్థాపించారు. ఆనవాయితీగా ఇప్పటికీ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కమిటీ సభ్యులందరూ ఈ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాజు పంతులు, మురళీ పంతులు, ఎ.మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.మల్లేష్, ఎ.మహేందర్ గిరి, కె.రాజ్ కుమార్, బి.సాయిబాబా, పి.జయరాం, మామిడి కృష్ణ, బి.వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సన్మానం



రంజిత్‌ను సన్మానిస్తున్న సందీప్‌కుమార్..

అబిడ్స్: ప్రభుత్వ ఫైనాన్స్ శాఖ అసిస్టెంట్ సెక్రెటరిగా పదోన్నతి పొందిన రంజిత్‌ను తెలంగాణ ఎస్సీ సంక్షేమ సంఘం సెక్రెటరి జనరల్ కె.సందీప్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సచివాలయ అధ్యక్షుడు ప్రశాంత్, ఇతర నాయకులు శ్రీనివాస్, ఖదీర్, వెంకటయ్య, నాగార్జున, చిన్ను, హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మేకలమండిలో పేరుకుపోయిన బురద



జియాగూడ వంద ఫీట్ల రోడ్డు ఇలా..

మేకల మండి.. బురద నిండి..

- బురదలో నుంచే వాహనాల రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ మండి, 100 ఫీట్ల రోడ్డులో పేరుకుపోతున్న బురద



కేసరి హనుమాన్ చౌరస్తాలో..

జియాగూడ: జియాగూడ రహదారులు వర్షాల ధాటిడికి కొట్టుకుపోయి గుంతలమయంగా మారాయి. ఇక 100 ఫీట్ల జాతీయ రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో రెండు దారుల్లో ఒకదారి మాత్రమే వాహనాలకు అనుకూలంగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జియాగూడ కమేళా దుస్థితి మరి అధ్వానంగా ఉంది. 15 రోజుల నుంచి వర్షం కారణంగా మండి పూర్తిగా బురదగా మారింది. దీంతో మేకల కొనుగోలు, స్లాటరింగ్‌కి వచ్చేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ రహదారిలో పూర్తికాని పనులు..

నాలుగు ఏళ్లుగా కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. రహదారిలో ఒక దారి పూర్తిగా పైపులైన్ నిర్మాణానికి సరిపోయింది. దీంతో రహదారి పూర్తిగా మట్టికుప్పలు, చెత్త కుప్పలు, మేకల విక్రయాలు, అక్రమ పార్కింగ్, చెత్త ట్రక్కులకు అడ్డుగా మారింది. అయితే ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం



డాక్టర్ విప్లవ దత్ శుక్లాతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా అధ్యాపకులు

చార్మినార్: భవిష్యత్ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా అన్నారు. సిటీ కాలేజీ, మహిళా సాధికారత విభాగం సంయుక్తాధ్వర్యంలో 'గర్ల్ బాస్ ఫ్యూచర్ రెడీ' శిక్షణా కార్యక్రమం ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించబడింది. ఉపాధి, వ్యాపారం, ఉన్నత విద్య-ఏ మార్గాన్ని ఎంచుకున్నా వారు సమాజానికి ఆదర్శం కావాలి. అందుకు మహిళా అధ్యాపకులకు ఈ శిక్షణ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ ఎన్‌జీఓ లాంచ్ గర్ల్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గర్ల్ బాస్ ఫ్యూచర్ రెడీ వంటి కార్యక్రమాలు విద్యార్థినులను ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తాయి. లాంచ్ గర్ల్స్ సంస్థతో కళాశాల విద్యాశాఖకి ఉన్న ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. లాంచ్ గర్ల్స్ సీఈఓ అగటా రుట్కోవిస్కీ, అనుశీలా చట్టర్జీ, జయ వర్ధన్ శిక్షణ అందించగా, శిక్షణా కార్యక్రమానికి సునీత సమన్వయకర్తగా వ్యవహరించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అధ్యాపకులకు విప్లవ్ దత్ శుక్లా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. శిరీష, డా.సుధారాణి, లలిత చైతన్య, సంతోష్, సిటీ కాలేజీ మహిళా అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కిరణ్మయి, న్యాయవాది ఏజాజ్ అలీ ఖురేషీ

యాకుత్‌పురా: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో సత్వరమే పరిష్కరించేందుకు 90 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. కిరణ్మయి అన్నారు. గురువారం సఖీ-2 చార్మినార్ కేంద్రంలో 90 రోజుల పాటు నిర్వహించనున్న మధ్యవర్తిత్వం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పలు కోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి 90 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించుకొనే వారు సఖీ కేంద్రాలు, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఏజాజ్ అలీ ఖురేషీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు తొలగించకుంటే చర్యలు



విద్యుత్ అధికారులతో కలిసి మంగళ్‌హాట్‌లో పర్యటిస్తున్న ఏసీపీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్

అఫ్జల్‌గంజ్: మంగళ్‌హాట్, ధూల్‌పేట్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సంభాలకు ఉన్న కేబుల్ వైర్లను కేబుల్ నిర్వాహకులు వెంటనే తొలగించాలని లేనిచో చర్యలు తప్పవని గోషామహల్ డివిజన్ ఏసీపీ ఎస్.సుదర్శన్ హెచ్చరించారు. మంగళ్‌హాట్, ధూల్‌పేట్, గుఫానగర్, ఇంద్రానగర్, రహింపురా, ఆర్కే పేట్‌లతో పాటు పలు ప్రాంతాల్లో మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులతో కలిసి ఏసీపీ సుదర్శన్ పర్యటించారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్ల పరిస్థితిని స్వయంగా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల కేబుల్ వైర్లతో ప్రమాధాలు సంభవిస్తున్నాయన్నారు. వెంటనే కేబుల్ నిర్వాహకులు విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించి సొంతంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కరాటేలో తెలంగాణ క్రీడాకారుల సత్తా



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో కోచ్ ఎంకె.బాలాజీ

జియాగూడ: ఛత్తీస్‌ఘడ్ రాయిపూర్‌లో జరిగిన 33 వీఏఐకెఎఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ టీం నుంచి బయలుదేరి 20 మంది కరాటే క్రీడాకారులలో 15 కాంస్య, సిల్వర్ 1, బంగారు మెడల్స్ 2 సాధించినట్లు ఏఐకెఎఫ్ సహా కోశాధికారి శ్రీబాలాజీ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర స్థాయిలో కరాటే క్రీడాకారులు జాతీయ స్థాయిలో గట్టి పోటీనిచ్చారన్నారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులలో బంగారు పతకాలు నవతా దీపిక, విమల్ రాజ్ సాధించగా, కియాన్ సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే కాంస్య పతకాలు సిద్ధార్థ, నరేష్, విష్ణు, కోయాల్కర్ గోపాల్, సాయికిరణ్ యాదవ్, హర్షిత ప్రసాద్, కురిష్ అయిషి, మహేష్ కావలే, గోపాల్ కియాల్కర్ తదితరులు గెలుపొందారు.

విద్యుత్ వైర్ల పరిశీలన

గౌలిపురా: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గౌలిపురా డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ కన్వీనర్ సాకేత్ పర్యవేక్షణలో విద్యుత్ ఫలక్‌నుమా ఏడీఈ, ఛత్రినాక ఏఈ, ఉత్సవ సమితి నాయకులతో కలిసి పలు ప్రాంతాల్లోని మండపాల వద్ద సమస్యలకు కారణమవుతున్న, వేలాడుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించారు. వినాయకులను మండపాలకు తరలించే సమయంలో విద్యుత్ వైర్లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు మహేశ్, శ్రీనాథ్, ఈశ్వర్, డివిజన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, వైభవ్, యశ్వంత్, స్వీకార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో కలిసి వైర్లను పరిశీలిస్తున్న ఉత్సవ సమితి నాయకులు

రాష్ట్రంలో అసమర్థ పాలన



గోల్కొండ: తెలంగాణలో అసమర్థుల పాలన కొనసాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరుసగా రాష్ట్రంలో విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు సంభవించి ఎన్నో నిండు ప్రాణాలు పోయాయన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో అన్ని విభాగాల్లో అవినీతి భారీ స్థాయిలో జరుగుతుందన్నారు. అవినీతిలో మాజీ సీఎం కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ముందుందని ఆయన ఎద్దేవ చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



గోల్కొండ: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం వారికి కిట్లను పంపిణీ చేస్తున్నామని బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవర వంశీ అన్నారు. గురువారం ఆయన గాయత్రీనగర్ కాలనీలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్, పలువురు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

విజయనగర్‌కాలనీ: పేకాట స్థావరంపై దాడి చేసి 16 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం ..గంగాబౌలి నట్రాజ్‌నగర్‌లోని ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టప్పాచబుత్ర పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 16 మంది పేకాటరాయుళ్లతో పాటు వారి వద్ద నుంచి రూ.93,390 స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం..సయ్యద్ అలీగూడకు చెందిన సురేష్(25) కారు డ్రైవర్. ఇతడు అనారోగ్యానికి గురవడంతో పాటు ఇతర దురాలవాట్లకు బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన సురేష్ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సీలింగ్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న టప్పాచబుత్ర పోలీసులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శాలిబండలో దోమల బెడద

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో దోమల బెడద అధికం కావడంతో స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద కారణంగా తాము డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీల్లో వారానికి రెండుసార్లు అయినా ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా బస్తీల్లో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్నారుల్లో మేధోసంపత్తిని వెలికి తీయాలి



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్

గన్‌ఫౌండ్రీ: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 'సృజనోత్సవ్'వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్వర మహతి కళాపరిషత్ సంస్థ ఆధ్వర్యంలో సృజనోత్సవ్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ కళ, సంపదపై నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రాచీన శాస్త్రీయ సంగీత కళలు మన దేశ సంపద అని ఈ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, సామాజిక వేత్త ఎ.రామకృష్ణ, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఆదిత్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డు తగిలే విద్యుత్ వైర్లుంటే ఫిర్యాదు చేయండి



గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న చార్మినార్ ఏడీఈ మక్సూద్

చార్మినార్: వినాయక మండపాల ఏర్పాటుతో పాటు విగ్రహాలను తరలించేటప్పుడు ఎక్కడైనా విద్యుత్ వైర్లు అడ్డంగా ఉంటే వెంటనే సమాచారం అందించాలని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ ఏడీఈ మహ్మద్ మక్సూద్ అన్నారు. గురువారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు టి.ఉమా మహేందర్, ప్యారసాని వెంకటేష్, చార్మినార్ నియోజకవర్గం కన్వీనర్ ముకేష్ యాదవ్, బీజేపీ నాయకులు సురేందర్, కునాల్‌రావు తదితరులతో కలిసి ఆయన పురానాపూల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వినాయక మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యుత్ వైర్లను ఎట్టి పరిస్థితుల్లో తాక రాదన్నారు. అవసరమైన చోట ఎయిర్ బంచ్ కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

విద్యుత్ వైర్ల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



అధికారులతో కలిసి రూట్‌ను పరిశీలిస్తున్న ఉదయ్ కిరణ్ రెడ్డి

చాంద్రాయణగుట్ట: వినాయక విగ్రహాలను మండపాలకు తరలించే సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి బహదూర్‌పురా నియోజకవర్గం కన్వీనర్ ఉదయ్ కిరణ్ రెడ్డి అన్నారు. ఫలక్‌నుమా, చార్మినార్ విద్యుత్ శాఖ అధికారులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి కొడీ మహేందర్‌లతో కలిసి గురువారం అలియాబాద్, పూల్‌బాగ్ చమాన్, లాల్‌దర్వాజా, రాజన్నబావి, దేవిబాగ్, మురళీనగర్‌లలో సంయుక్తంగా విద్యుత్ వైర్లను పరిశీలించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలలో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాతబస్తీలో విద్యుత్ వైర్లను ఆధునీకరించాలని కోరారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గజల్ల సాహితీ వైద్యం వాట్సాప్ సమూహంల ఆధ్వర్యంలో పలువురు రచయితలు రాసిన పుస్తకాల ఆవిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గజల్ కవి డాక్టర్ పోతగాని సత్యనారాయణ మాట్లాడుతూ..అనేక అంశాలపై పరిశోధన చేసి గజల్ సాహిత్యంలో ఏక కాలంలో 6 పుస్తకాలను తీసుకురావడం అభినందనీయమన్నారు. గజల్ సాహిత్యంపై 6 పుస్తకాలను తీసుకురావడాన్ని ఒక రికార్డుగా గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అవార్డును అందజేసింది. భావలహరి, వెన్నెల సిరులు, దరహాస చంద్రికలు, రాగ విలాసం, వసంత వల్లరి, మంచుపూలు పుస్తకాలను ఈ వేదికపై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గజల్ కవయిత్రి ఉమాదేవి జంధ్యాల, శంషాబాద్ ఏసీపీ పి.నాగభూషణం, పలువురు రచయితలు పాల్గొన్నారు.

బాక్సింగ్‌కు పెరుగుతున్న ఆదరణ



గోల్కొండ బాక్సింగ్ క్లబ్ బాక్సర్లతో కోచ్ షేక్ ఏజాజ్ అహ్మద్ తదితరులు

గోల్కొండ: బాక్సింగ్‌పై ప్రైమరీ తరగతుల విద్యార్థులు మక్కువ చూపుతున్నారని ప్రముఖ బాక్సింగ్ కోచ్ షేక్ ఏజాజ్ అహ్మద్ అన్నారు. గురువారం గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌లో ఆయన బాక్సింగ్ నేర్చుకుంటున్న జూనియర్స్, సబ్ జూనియర్స్ బాక్సర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా తాము ఆయా పాఠశాలలు కోరినట్లు అయితే వారంలో కనీసం రెండు రోజులు ఉచిత శిక్షన ఇస్తామన్నారు. పీస్ ఫోర్స్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ..ప్రఖ్యాత బాక్సర్ 13 సార్లు జాతీయ సర్వీసెస్ చాంపియన్ ఘణీచాంద్ గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌ను స్థాపించారన్నారు. తాము సంవత్సరంలో కనీసం రెండుసార్లు గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ పొందిన వివిధ విభాగాల వారికి బాక్సింగ్ పోటీలు నిర్వహించి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా బాక్సింగ్‌లో విశేష ప్రతిభకనబరిచిన ఉమేర్ ఆబేద్ ఆలీని కోచ్ ఏజాజ్ అహ్మద్ పూలమాలలు వేసి క్లబ్ తరఫున ఉచితంగా బాక్సింగ్ కిట్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్, ఖురేషి, బాక్సింగ్ కోచ్ షేక్ అనస్ అహ్మద్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఆయన సానుకూలంగా స్పందించారు. హకీంపేట్, గోల్కొండ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తాము ఉంటున్న డబుల్ బెడ్‌రూమ్‌ల సమస్యలను ఆయనకు వివరించారు. గత సంవత్సరం తమకు డబుల్ బెడ్‌రూమ్ వచ్చిందని కొల్లూరు, రాజేంద్రనగర్ మండలాలలో కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్‌లకు మారడం జరిగిందని అయితే ఇక్కడ తాము ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. దీన్నిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే తాను కార్వాన్ నియోజకవర్గ పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించబడ్డ సైట్‌కు వచ్చి స్వయంగా సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి తరం విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ సూచించారు. గురువారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, సామాజిక, ఆర్థికాభివృద్ధి, అవకాశాలు, సవాళ్లు, భవిష్యత్ దిశలు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఏఐపై అవగాహన కలిగించి మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి, సీసీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆనంద్ పవర్, హెచ్‌సీయూ అసోసియేట్ ప్రొఫెసర్ వెంకట శ్రీనివాస్, సదస్సు చైర్‌పర్సన్ చంద్ర ముఖర్జీ, అయోధ్య శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.